క్లుప్తంగా

నేడు సామాజిక ప్రజావేదిక

దహెగాం: ఉపాధిహామీ పథకంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై స్థానిక రైతువేదికలో శనివారం 13వ సామాజిక ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజావేదికకు సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి సిబ్బంది హాజరుకావాలని సూచించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

లింగాపూర్: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆడె సవితాప్రేమ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారులు సమయపాలన పాటించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అధికారులు పట్టించుకుని చర్యలు చేపట్టాలాన్నరు. అనంతరం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం ఉన్నందున సమావేశం ముగించారు. సమావేశం చివరిది కావడంతో గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మహిళా ప్రజాప్రతినిధులు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎంపీడీవో ప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్‌వర్మ, వైస్ ఎంపీపీ ఆత్మారం తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా..



ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

బెజ్జూర్: అనారోగ్యం బారినపడి మంచానికి పరిమితమైన తన స్నేహితుడికి బాలమిత్రులు అండగా నిలిచారు. మండలంలోని కుకూడా గ్రామానికి చెందిన కొట్రంగి రమేశ్ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆయన బాల్యమిత్రులు శుక్రవారం ఆయన నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. చాకటి శ్రీధర్, రంగు సురేశ్‌గౌడ్, గోరెంట్ల వసంత్, కావుడే రాజు, అహ్మద్, రాజలింగ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ ఇన్‌చార్జిని కలిసిన పాల్వాయి



మురళీధర్‌రావును కలిసిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావును హైదరాబాద్‌లో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచిన హరీశ్‌బాబును మురళీధర్‌రావు అభినందించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

కౌటాలకు చేరిన అక్షింతలు



అక్షింతలతో సభ్యులు

కౌటాల: అయోధ్య రామాలయానికి సంబంధించిన అక్షింతలు శుక్రవారం రాత్రి కౌటాలకు చేరుకున్నాయి. బెజ్జూర్ నుంచి తీసుకువచ్చిన అక్షింతలకు కౌటాల రామాలయంలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అన్ని గ్రామాల్లో ఇంటింటికీ కరపత్రం, రామమందిరం ఫొటో స్టిక్కర్, అక్షింతలు పంపిణీ చేస్తామని సభ్యులు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ప్రబీర్ మండల్, ప్రజవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సత్తన్న, ఎల్ములే దత్తు, శివప్రసాద్ పాల్గొన్నా రు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసిన నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: గోషామహల్ ఎమ్మెల్యేగా మూడోసారి ఎన్నికైన రాజాసింగ్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బజరంగ్‌దళ్ నాయకులు కలిశారు. బజరంగ్‌దళ్ నాయకులు శివగౌడ్, హిందూ ఉత్సవ సమితి ఆర్గనైజర్ లెక్కల మురళీ, బీజేపీ నాయకుడు అరుణ్ లోయ, కార్తీక్, చిట్టి నరేశ్ ఉన్నారు.

ఆలయంలో సత్సంగ్

జైనూర్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం సత్సంగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులతోపాటు హరిభక్త పారాయణ్ నారాయణ్ మహరాజ్‌లు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ జొంగ్రే సమాధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు గిత్తే గోపినాథ్, కమిటీ సభ్యులు కేంద్రే పరుశురాం, కేంద్రే ప్రకాశ్, గుగ్గే ఉత్తమ్ పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’కు దరఖాస్తుల వెల్లువ

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్యారంటీల పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. రెండోరోజూ శుక్రవారం అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండలంలోని కొండపల్లి, ఖైరిగాం, గంగాపూర్, నారాయణ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఖైరిగాంలో అడిషనల్ కలెక్టర్ వేణు, తుంగెడలో డీపీవో ఒమర్, నారాయణపూర్‌లో ప్రత్యేకాధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెనలో దరఖాస్తుల స్వీకరణను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ పరిశీలించారు. ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ సమీర్, ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: చిర్రకుంట, సాలేగూడ జీపీల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లను ఎంపీపీ మల్లికార్జున్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్, సర్పంచ్ వినోద్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): హుడ్కిలి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ ముబిన్, ఎంపీవో మహేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం: అర్హులందరికీ గ్యారంటీ పథకాలు అందిస్తామని కాగజ్‌నగర్ ఆర్డీవో సురేష్ తెలిపారు. మండలంలోని బీబ్రా, కోత్మీర్, చంద్రపల్లి, బామానగర్ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సర్పంచులు తరనుం సుల్తానా, లగ్గామ దామోదర్, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, ట్రాన్స్ కో ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని గోయగాం, ధనోరా, అనార్‌పల్లి, బోరిలాల్‌గూడ గ్రామాల్లో ప్రజాపాలన కొనసాగింది. నాలుగు పంచాయతీల్లో రెండోరోజు దరఖాస్తులు 753 వచ్చాయని ఎంపీడీవో మహేందర్ తెలిపారు. సర్పంచులు గావుత్రె రజిత, చిలుక, భీంరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజలింగు, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని అన్ని పంచాయతీల్లో అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. రెండోరోజు తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి గురడుపేట్, తలోడి పంచాయతీలు, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్ పార్డీ, ముత్తంపేట్ గ్రామాల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు 2,563 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. మండలంలోని మొగడ్‌దగడ్, తాటిపల్లి, శీర్షా, గుడ్లబోరి గ్రామాల్లో శనివారం ప్రత్యేక అధికారులు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

చింతలమానెపల్లి: బూరెపల్లి, రణవెల్లి, రుద్రాపూర్, హేటిగూడ గ్రామాల్లో తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మష్కూర్ అలీ పాల్గొని శుక్రవారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, పంచాయతీల వద్ద కౌంటర్ల వద్ద దరఖాస్తు ఫారాలు లేవని అధికారులు తెలిపారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో జిరాక్స్ కేంద్రాల వద్దకు పరుగులు తీయగా నిర్వాహకులు అధిక ధరలకు విక్రయించారు.



ఖైరిగాంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణు



కెరమెరి మండలం గోయగాంలో..



చింతలమానెపల్లి: బూరెపల్లి గ్రామంలో



తుంగెడలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీపీవో



ఆసిఫాబాద్‌రూరల్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ



దహెగాం: కోత్మీర్ గ్రామసభలో ఆర్డీవో



కౌటాల: తలోడి గ్రామంలో..



దహెగాం పంచాయతీ కార్యాలయం వద్ద..



కెరమెరి మండలం ధనోరాలో..

కంకర సరే.. తారేది?



కంకర పోసి వదిలేసిన కోయగూడ-గురుడుపేట రోడ్డు

- గ్రామాల్లో నిలిచిపోయిన పనులు
- ఇబ్బందుల్లో వాహనదారులు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

కౌటాల: మండలంలో గత బీఆర్‌ఎస్ హయాంలో రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయని.. అసెంబ్లీ ఎన్నికల ముందు పాలకులు, శాఖల అధికారులు హడావిడిగా రోడ్డు పనులు ప్రారంభించారు. ఆర్ అండ్‌బీ, పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన పనులు నిర్మాణ దశలో నిలిచాయి. కౌటాల-టీకంగూడ వరకు దాదాపు 8 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత అక్టోబర్‌లో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమిపూజ చేశారు. కోయగూడ-గురుడుపేట వరకు 2 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులతో ఐదునెలల క్రితం పనులు ప్రారంభించారు. సంబంధిత కాంట్రాక్టర్లు రోడ్డుపై కంకర పోసి వదిలేశారు. నెలల తరబడి తారు వేయడం మరిచారు. దీంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

నెలలు గడుస్తున్నా..

మండల కేంద్రం నుంచి టీకంగూడ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కంకరపోసి నెలలు గడుస్తున్నా తారు వేయలేదు. దుమ్ము రాకుండా రోడ్డుపై సంబంధిత కాంట్రాక్టర్ నీళ్లు పట్టాల్సి ఉంది. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనాలు వెళ్లిన ప్రతీసారి దుమ్ము రావడంతో ఇబ్బంది పడుతున్నారు. కోయగూడ-గురుడుపేట రోడ్డుపై పోసిన కంకర నుంచి వెళ్లే ద్విచక్ర వాహనదారుల బాధలు వర్ణనాతీతం. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, వాహనాలు, చెట్లు దుమ్ముగా మారుతున్నాయి. స్థానికులు తమ కళ్లు, ముక్కులో మంట, దగ్గు సమస్యలతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వమైనా రోడ్డు పనులపై దృష్టిసారించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



కౌటాల-గుడ్లబోరి రోడ్డుపై వేసిన కంకర

రోడ్డు పనులు పూర్తిచేయాలి

కౌటాల-టీకంగూడ రోడ్డు సమీపంలోనే మా ఇల్లు ఉంది. రోడ్డుపై కంకర వేసి రోజులు గడుస్తున్నా తారు వేయడం లేదు. నీళ్లు పట్టడం లేదు. వాహనాలు వెళ్లిన ప్రతీసారి దుమ్ము వస్తుంది. అధికారులు పట్టించుకుని రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– చంద్రరెడ్డి, కోయగూడ

చర్యలు తీసుకుంటాం

కోయగూడ-గురుడుపేట బీటీ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి కంకరపోశారు. కంకర పై నుంచి ప్రతీరోజు నీళ్లు పట్టాలని ఆదేశిస్తాం. రోడ్డుకు సంబంధించి కొన్ని నిధులు రావల్సి ఉంది. త్వరలో రోడ్డు పనులు పూర్తికి చర్యలు తీసుకుంటాం.

– బద్రుద్దీన్, ఏఈ, కౌటాల

నేడు ‘కల్యాణలక్ష్మి’ చెక్కుల పంపిణీ

బెజ్జూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఉదయం 10 గంటలకు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ భూమేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, సహకార సంఘం చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు.

హమాలీ రేట్లు పెంచాలి

ఆసిఫాబాద్‌అర్బన్: సివిల్ సప్లై హమాలీ రేట్లు క్వింటాల్‌కు రూ.40కు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గోదాం ఎదుట హమాలీ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 31తో ఒప్పందం ముగియనున్న నేపథ్యంలో జనవరి 1 నుంచి క్వింటాల్‌కు ఎగుమతి, దిగుమతి రేటు రూ.40కి పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, 55 ఏళ్లు నిండిన వారికి రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా కింద రూ.20 లక్షలు, రిటర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు, సొంతింటి పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్మికులు దివాకర్, మోహన్, శ్రీనివాస్, కొమరక్క, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

మరుగుదొడ్ల బిల్లుల అవినీతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామంలో 2020 స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్మించిన మరుగుదొడ్ల బిల్లుల్లో అవినీతి జరిగిందని అధికారులు విచారణ చేపట్టాలని బీజేపీ నాయకుడు శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో 296 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, వాటికి బిల్లులు లబ్ధిదారులకు అందకుండా ఇతరుల అకౌంట్‌లోకి వెళ్లాయని ఆరోపించారు. మరుగుదొడ్ల బిల్లుల అవినీతిపై మండల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని కోరారు. నాయకులు భీమేష్, సాయిక్రిష్ణ, వెంకన్న, విలాస్, సాయి, సురేష్, మల్లేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం వేలం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ఐదు ఎంఎల్‌సీ పాయింట్లలోని 3,375.50 క్వింటాళ్ల పనికిరాని రేషన్ బియ్యాన్ని వేలం వేయనున్నట్లు పౌరసరఫరాల అధికారి తారామణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతి ఉన్న డిస్టిలరీ వారికి మాత్రమే వేలంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు జనవరి 10లోగా డీసీఎస్‌వో కుమురంభీం పేరుపై రూ.2వేల డీడీ తీయాలని సూచించారు.

సర్పంచుల పనితీరు ప్రశంసనీయం

- ఎంపీపీ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి

కెరమెరి: గడిచిన ఐదేళ్లలో సర్పంచుల పనితీరు ప్రశంసనీయమని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పతబాయి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచులకు ఇదే చివరి సర్వసభ్య సమావేశం అయినప్పటికి నిరుత్సాహపడొద్దని, మీ పనితీరును ప్రజలు గుర్తిస్తారన్నారు. ఇదే ఉత్సాహంతో మరోసారి పోటీ చేసి గెలవాలన్నారు. మీ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, జిల్లాస్థాయిలో అవార్డులు పొందిన జీపీలు ఉండడం గర్వకారణమన్నారు. అనంతరం చాలామంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, పాఠాలు చెబుతున్నారా? రాజకీయం చేస్తున్నారా? అంటూ మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సభాదృష్టికి వచ్చిన సమస్యలు, వారి పరిష్కారాలు ఇలా ఉన్నాయి.

- 7,582 మంది రైతుల పేర్లు రైతుబంధు కోసం ఆన్‌లైన్‌లో ఉండగా ఇప్పటికి కేవలం 475 మందికి డబ్బులు వచ్చాయని ఏవో గోపీకాంత్ అన్నారు. మిగిలినవారికి రావల్సి ఉందన్నారు.
- ముకదంగూడ పంచాయతీలో రెండేళ్లుగా కూలీలు చేసిన పనికి డబ్బులు రావడం లేదని సర్పంచ్ లింబాదాస్ తెలిపారు. రెండు ప్రభుత్వాలకు చెందిన జాబ్‌కార్డులు ఉండడం వల్ల ఇబ్బందులు అవుతున్నాయన్నారు. ‘వన్ నేషన్, వన్ రేషన్’లో భాగంగా ఏదైన ఒక జాబ్‌కార్డును డిలీట్ చేస్తేనే డబ్బులు వస్తాయని ఎంపీడీవో సమాధానమిచ్చారు.
- అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వరరావు తెలపగా, పరస్‌వాడలో పైప్‌పగిలి నీరు రావడం లేదని కెలిబి సర్పంచ్ నారాయణ తెలిపారు. పార్డలో, ధనోరా, కొలాంగూడల్లో నీరు రావడం లేదని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, జెడ్పీటీసీ పేర్కొన్నారు.
- పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్, ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం కొనసాగుతుందని ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ చెప్పారు. దీంతో భోజన కార్యక్రమాలు బాగున్నా, పాఠశాలల్లో టీచర్లు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుందని ఎంపీటీసీ ఇష్తేకార్, సర్పంచ్ శేశారావు పేర్కొన్నారు. ఝరి ఉర్దూ మీడియం హైస్కూల్‌లో టీచర్లు లేరని, ఫర్నిచర్ లేదని చెప్పుకొచ్చారు. కొందరు టీచర్లు బడులకు ఎగనామం పెడుతూ రాజకీయం చేస్తున్నారని, రోడ్లపై తిరుగుతూ, సమయపాలన పాటించడందని లేదని ఎంపీపీ, జెడ్పీటీసీ చెప్పారు. ఖాళీల జాబితా ఇస్తే కలెక్టర్‌కు సమర్పిస్తామని చెప్పారు. లిఖితపూర్వకంగా రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని ప్రకాశ్ చెప్పారు.
- నర్సరీల ఏర్పాటు, మొక్కల ఎదుగుదల గురించి ఎఫ్‌ఆర్వో నజీర్ అలీ చెబుతుండగా సభ్యులు కల్పించుకుని కోతుల బెడద నుంచి తప్పించాలని కోరారు. మూడు నెలలకోసారి జరిగే సభకు ఎఫ్‌ఆర్వో హాజరుకాకుంటే ఎలా అని ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రశ్నించారు.
- నాలుగు నెలలుగా గుడ్లు అందడం లేదని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారిని ఎంపీటీసీ ఇష్తేకార్ ప్రశ్నించారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
- మహిళా సంఘాలకు రూ.12 కోట్ల రుణాలు అందించాలని టార్గెట్ ఉండగా, ఇప్పటివరకు రూ.9 కోట్లు ఇచ్చామని, మరో మూడు నెలల్లో రూ.3 కోట్లు చెల్లిస్తామని ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ తెలిపారు.
- పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 23 పీటీజీ గ్రామాలకు మౌలిక సదుపాయాల కల్పనకు సర్వే చేశామని ఎంపీడీవో మహేందర్ తెలిపారు. గ్రామాల్లో పక్కా ఇళ్లు, బీటీ రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం తదితర మౌలిక వసతులు కల్పించనున్నారు. మరో మూడు గ్రామాలను ఎంపిక చేశామన్నారు.
- ఆర్టీసీ బస్సుల కోసం డీఎంకు వినతిపత్రం సమర్పిస్తే రూట్ సర్వే చేయించి బస్సు ప్రారంభించే ఏర్పాటు చేస్తామని ఆసిఫాబాద్ బస్‌డిపో ఆర్టీసీ ఏడీసీ జాడి శంకర్ తెలిపారు. జోడేఘాట్, జీవితి, నిసాని, ఆదిలాబాద్ రూట్లకు బస్సు నడపాలని సభ్యులు డిమాండ్ చేశారు. శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మోతిరాం

నిరుపయోగంగా భవనం



కౌటాల: మండలంలోని యాపలగూడలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం నిరుపయోగం మారింది. రూ.5.30 లక్షల నిధులతో గతేడాది నిర్మించిన భవనంలో సంబంధిత కాంట్రాక్టర్ తలుపుతోపాటు రెండు కిటికీలు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే నిధులు లేవని కాంట్రాక్టర్ పని చేపట్టలేదు. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా, భవనం నిరుపయోగంగా ఉండడంతో స్థానికులు అందులో పశువులను కట్టేస్తున్నారు. చుట్టూ చెత్తాచెదారంతో భవనం అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతుంది. మందుబాబులకు అడ్డాగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.